# హరికొలువు

## సంపుటము - 2



## ధారావాహికం - 3 6

శ్రీ జూలకంటి
బాలసుబ్రహ్మణ్యం

శంకరాభరణం(తివడ)

నందకాయుధ ధరా! నీయాయుధంబులకు జయ జయ!
నీ వాహనంబులకు శుభమస్తు! నీ పరివారంబులకు క్షేమంబుగోరెద!
నీ కల్యాణ గుణంబులకు నుత్తరోత్తరాభివృద్ధి యగుంగాక!
నీ సర్వాంగంబులకు శోభన పరంపరావాప్తి యెసంగవలయు!
నీ దేవుళ్లకు మంగళ మహాశ్రీశ్రీ లగు!
నీ మహిములకు ననంత విధార్చనము! నీ భుజ బలమునకు నపరిమిత స్తోత్రంబు!
నీ చక్కందనమునకు బుష్పాంజలి! నీయుదారత్వంబునకు శరణంబు!
నీ శ్రీవత్స కౌస్తుభాది చిహ్నంబులకు సతత ప్రార్థన!
నీ పాదంబులకు సాష్టాంగ నమస్కారంబునుం జేసెద!
నేమి నిమిత్తంబు సేసెద నంటివా;
నాలుగు యుగముల ధర్మంబులు, సకల జంతువుల పరిణామములు
నీవు శుభమున నుండుటే మేలు శ్రీవేంకటేశ్వరా!

--శ్రీ వేంకటేశ్వర వైరాగ్య వచనమాలికా గీతాలు (పెదతిరుమలాచార్యులు)

గోవిందా! గోవిందా!! గోవింద!!!

# సప్తగిరీశుని సంవత్సరోత్సవాలు

### తెప్పోత్సవాలు

తెప్ప అనగా పడవ, ఓడ. ఓడలో సుఖాసీనులైన శ్రీ తిరుమలస్వామివారిని కోనేటిలో విహారం చేయించడమే తెప్పోత్సవం అంటారు. ఈ తెప్పోత్సవాలను తమిళంలో 'తిరుపల్లి ఓడై తిరునాళ్' అంటారు. వీటినే తెలుగులో ''తెప్ప తిరునాళ్లు'' అని అంటారు.

తిరుమలలో శ్రీవేంకటేశ్వరునికి అత్యంత ప్రాచీనకాలం నుండే తెప్పోత్సవాలు జరిగేవని తెలుస్తున్నది. ఈ ఉత్సవాల కొరకే క్రీ.శ. 1468 లో పుష్కరిణి మధ్యలో, సాళువ నరసింహరాయలు ఒక మండపాన్ని నిర్మించారు. దీనినే ''నీరాళి మండపం'' అంటారు. ఆ సమయంలో ఈ మండపంలో కొలువై వున్న స్వామివారికి

నివేదనల కట్టడి ఏర్పాటు చేశాడట! అప్పట్లో ఈతెప్పోత్సవాలు సంక్రాంతి పండుగ మరురోజు, బ్రహ్మోత్సవా ల్లోను, ఇంకా ఆయా సందర్భాల్లో జరుప బడేవని తెలుస్తున్నది.

క్రీ.శ. 15 వ శతాబ్దానికి చెందిన అన్నమయ్య తిరుమల తెప్పోత్సవాలను గొప్పగా కీర్తించాడు.

## లలిత

ఎందు నీకు ప్రియయో
యీ తెప్ప తిరునాళ్లు
దిందువడె సిరులతో
తెప్ప తిరుణాళ్లు

పాల జలనిధిలో
బవ్వలించి పాము తెప్ప
దేలుచున్నదది దెప్ప తిరునాళ్ళు

వోలి నేకోదకమై వొక్క
మర్రియాకు మీ ద
తేలుచున్న దది తెప్ప తిరుణాళ్లు.

అమృతము దచ్చునా డు
అంబుధిలో మంధరము
తెమల దేలించు తెప్ప తిరుణాళ్లు

యమునలో కాళింగు
నంగపు పడిగె మీ ద
తిమరి తొక్కిన తెప్ప తిరునాళ్లు.

అప్పుడు పదారువేలు
అంగనల చెమటల
తెప్పల దేలిన తెప్ప తిరునాళ్లు

వొప్పుగ శ్రీ వేంకటాద్రి
నున్నతి గోనేటిలోన
తెప్పరిల్లెనే ట నే ట
తెప్ప తిరుణాళ్లు.

--అన్నమయ్య ఆధ్యాత్మ కీర్తన - 143
(సంపుటము - 2 - 1981)

అంతేగాక స్వామివారు తేలియాడే కోనేటి మహత్మ్యాన్ని కూడ అన్నమా చార్యులు గొప్పగా కీర్తించాడు. అన్నమయ్య కుమారుడు పెద తిరుమలయ్య, నీరాళి మండపాన్ని, పుష్కరిణిని బాగు చేయించాడు.

ఇలా చాలాకాలంనుంచి జరుగు తున్న తెప్పోత్సవాలు ఏ కారణం చేతో మధ్యలో ఆగి పోయాయి. మళ్లీ మహంతు ప్రయాగదాసు 'తిరుమల తెప్పోత్సవాలను ఉద్ధరించి, దుర్మతి నామ సంవత్సర (1921) ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నుంచి 5 రోజులపాటు జరిగేట్లుగా ఏర్పాటు చేశాడు. మళ్లీ ఆనాటినుండి నిరాఘాటంగా తెప్పోత్సవాలు సాగిపోతున్నాయి.

ప్రస్తుతం ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసంలో శుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు ఐదు రోజులపాటు తెప్పోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇవి సాధారణంగా మార్చి - ఏప్రిల్ నెలల్లో జరుగుతాయి.

ఐదురోజులపాటు జరిగే ఈ తెప్పోత్సవాల్లో మొదటి (ఏకాదశి రోజు) సాయంకాలం 6 గంటలకు తిరుమల కోనేట్లో తెప్పలో విహరించుటకు శ్రీ సీతారామ లక్ష్మణులు ఆలయం నుండి ఛత్రచామర మర్యాదలతో బయలు వెడలి, ఆలయ మహా ప్రదక్షిణ మార్గంలో ఊరేగుతూ, చివరకు కోనేటి దరిని చేరుకొని తెప్పను అధిరోహిస్తారు. మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాల కాంతిలో, వేద నాదాల మధ్య, మంగళ వాయిద్యాలు మోగు తుండగా, అన్నమయ్య కీర్తనల్ని వింటూ, శ్రీ సీతా రామ లక్ష్మణులు సర్వ శోభాయమానంగా తీర్చిదిద్ది అలంక రించిన తెప్పలో మూడు మార్లు ప్రదక్షి ణంగా విహరిస్తారు. నాలుగు వైపులా కోనేటి ఒడ్డున మెట్లపై వేలాది మంది భక్తజనం శ్రీస్వామివారలను కన్నులారా తిలకించి పులకిస్తారు.

మొదటి రోజు మూడు ప్రదక్షిణలు అయిన వెంటనే నివేదన కర్పూరహారతి జరిగిన తర్వాత ఆర్జిత సేవా భక్తులకు వస్త్ర బహుమానం జరుగుతుంది. ఆ తర్వాత శ్రీ సీతారామ లక్ష్మణులు పల్లకి నెక్కి ఛత్రచామర మర్యాదలతో ఆలయ ప్రవేశం చెయ్యడంలో మొదటి రోజు తెప్పోత్సవం ముగుస్తుంది.

ఇక రెండవరోజు ద్వాదశిరోజున శ్రీ రుక్మిణీ కృష్ణులు పురవీథుల్లో ప్రదక్షిణంగా ఊరేగుతూ వచ్చి, పుష్కరిణిలోని తెప్ప నధిరోహించి మూడుమార్లు ప్రదక్షిణంగా విహరిస్తారు. ఆ తర్వాత నివేదనలు, హారతి అనంతరం శ్రీరుక్మిణీ కృష్ణులు ఆలయ ప్రవేశం చేస్తారు.

ఇక మూడవరోజు త్రయోదశినాడు శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి తిరుచ్చినెక్కి సర్వాభరణభూషితుడై ఛత్ర చామర మర్యాద పురస్సరంగా పురవీథులో ఊరేగుతూ కోనేటికి వచ్చి తెప్పలో ఆసీనులై వేదగానాల మధ్య భాజాభజంత్రీలు మ్రోగు తుండగా, బాణా సంచా కాలుస్తుండగా అశేష భక్త జనాన్ని అనుగ్రహిస్తూ మూడు మారులు ప్రదక్షిణ విహరిస్తారు. చివరనైవేద్య

హారతులిస్తారు. ఆ తర్వాత శ్రీస్వామివారు దేవేరులతో ఆలయాన్ని ప్రవేశిస్తారు.

ఇలాగే నాలుగవరోజు శ్రీదేవి భూదేవులతో కూడిన శ్రీవేంకటేశ్వర స్వామివారు ఐదు ప్రదక్షిణాలున్ను ఐదవ రోజు 7 మార్లు తెప్పలో విహరిస్తారు.

వేసవి ప్రారంభంలో పున్నమిరోజుల నాటి వెన్నెల కాంతుల్లో చల్లని నీళ్లల్లో శ్రీస్వామివారిని ఊరేగించే ఈ తెప్పోత్స వాలను భక్తులు కూడ నిర్ణీత ఆర్జిత రుసుమును చెల్లించి చేయించవచ్చును.

ఒకరోజు తెప్పోత్సవానికి రు.2,500/- లు డి.డి. ఏ బాంకులోనైనా ''ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, తి.తి. దేవస్థానములు, తిరుపతి'' వారి పేర తీసి, దానిని ''పేష్కారు, తిరుమల శ్రీవారి ఆలయం, తిరుమల - 517 504'' వారికి చాల ముందుగా పంపుతూ రిజర్వు చేసుకోవచ్చు. అనుమతిని ధ్రువపత్రం ద్వారా ముందుగానే భక్తులకు తెలియ జేయబడుతుంది. అయినా, అప్పటికి వున్న అవకాశాన్ని బట్టి మాత్రమే వీలు కల్పించబడుతుంది.

నిర్ణీత రుసుమును చెల్లించిన గృహస్థుతో పాటు 5 మందికి శ్రీవారి దర్శనం కల్పించబడు తుంది. తెప్పోత్సవం ప్రారంభానికి ముందు గృహస్థుచే సంకల్పం చెప్పించబడుతుంది. చివర్లో ఉత్తరీయం, ఒక రవిక గుడ్డ బహుమానంగా ఇవ్వబడతవి. పిదప వీరు శ్రీవేంకటేశ్వర స్వామివారి మూలవరుల దర్శనానికి కూడ అనుమ తించబడతారు.

ఈ సంచికతో హరికొలువు - రెండవ సంపుటం ''మలయప్ప వైభవం'' పూర్తి అయింది. ఈ ధారావాహికంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి జరిగే ఉత్సవాలు, ఊరేగింపులు, సేవలు చాలావరకు వివరించబడినాయి. ఇంకా ఏవైనా మిగిలివుంటే వాటిని కూడ పుస్తకంలో చేర్చి ముద్రించుటకు ప్రయత్నం చేస్తాము. ఈ ధారావాహికం శుభంగా సంపూర్తి అయి నందులకు అందరం కూడ సప్తగిరీశుని ఎలుగెత్తి ప్రార్థించుదాం.

**గోవిందా! గోవిందా! గోవింద!!**





# ఆనందనిలయం

## ధారావాహికం

శ్రీ వేంకటేశ్వరస్వామి వేంకటాచల క్షేత్రంలో అర్చామూర్తిగా కొలువై వున్న దివ్య భవనమే ''ఆనందనిలయము''.

శ్రీ వైకుంఠం నుంచి భూలోక వైకుంఠమైన వేంకటాద్రిలో ఈ ఆనందనిలయం ఎప్పుడు అవతరించింది? ఎలా అవతరించింది.

మున్నగు వివరాలతోపాటు, ఇంకా అనేకమైన తిరుమల కథలు కూడా అత్యంత సరళంగా ఈ ధారావాహికలో చదవండి.

హరికొలువు రచయిత శ్రీ జూలకంటి సుబ్రహ్మణ్యం కలం నుండి వెలువడుతున్న ధారావాహికం ''ఆనంద నిలయం''.

ఈ ధారావాహికం వచ్చే సంచిక (మార్చి 2003) నుంచి ప్రారంభమౌతుంది. తప్పక చదవండి.

## వచ్చే సంచికలో ప్రారంభం